క్లుప్తంగా

ఆలయంలో కేశ ఖండనశాల ప్రారంభం



పొన్నూరు: పట్టణంలోని శ్రీ సహస్రలింగేశ్వర స్వామి, శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో నూతనంగా నిర్మించిన కేశ ఖండనశాల, కార్య నిర్వహణ గదుల్ని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, పార్టీ నేత వట్టిప్రోలు రంగారావు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో పేదలకు పక్కాగా ఇంటి స్థలాలు



గుంటూరు రూరల్ (ప్రత్తిపాడు): పేదలందరికీ పక్కాగా ఇంటి స్థలాలు ఇచ్చిన చరిత్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదేనని గుంటూరు రూరల్ ఎంపీపీ ఇంటూరి పద్మావతి అన్నారు. మండల పరిధిలోని వెంగళాయపాలెంలో గురువారం ప్రభుత్వం మహిళలకు అందజేసిన ఇంటి స్థలాలకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించి డాక్యుమెంట్లును అందజేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ పద్మావతి మహిళలకు డాక్యుమెంట్లు, పట్టాలను అందజేశారు. గతంలో ఎన్నడూ పేదలకు ఇంత పెద్ద మొత్తంలో ఇంటి స్థలాల్ని ఇచ్చిన దాఖలాలు లేవని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో ఇచ్చిన మాటకు కట్టుబడి పేదలకు గృహయోగం కల్పించారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బోడిపాలెం ఎంపీపీ పాఠశాల తనిఖీ

బోడిపాలెం(కాకుమాను): మండలంలోని బోడిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. విద్యార్థుల ఉన్నతే లక్ష్యంగా ప్రతి ఉపాధ్యాయుడు పని చేయాలని చెప్పారు. మాదిరి పాఠ్యాంశ బోధనా పద్ధతిలో విద్యను అందించాలని ఆయన సూచించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయన్న విషయాన్ని తల్లిదండ్రులకు వివరించి విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని చెప్పారు. ఆయన వెంట హెచ్ఎం ఎల్.వీరాంజనేయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

మలినేనిలో నేడు, రేపు సంస్కృతి - 2024

ప్రత్తిపాడు: మండలంలోని పుల్లడిగుంటలో గల మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల ఒకటి, రెండు తేదీల్లో సంస్కృతి- 2024 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జెట్టి అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయిలో నిర్వహించనున్న టెక్నో, కల్చరల్, స్పోర్ట్స్ ఫెస్ట్‌కు వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 1,800 మంది విద్యార్థులు హాజరవ్వనున్నారని ప్రోగ్రాం కన్వీనర్ గోనుగుంట్ల రామస్వామి పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా జేఎన్‌టీయూకే డైరెక్టర్ ఆఫ్ వాల్యుయేషన్ బి.బాలకృష్ణతో పాటు పలువురు హాజరవ్వనున్నట్లు తెలియజేశారు.

నేడు తక్కెళ్లపాడులో ఉచిత కంటి వైద్య శిబిరం

పెదకాకాని: శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో మండలంలోని తక్కెళ్లపాడు శివాలయం వద్ద శుక్రవారం ఉదయం 9 గంటలకు కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించినున్నట్లు సీఈఓ డాక్టర్ పొట్టి సుధాకర్ తెలిపారు. ఉచితంగా కంటి వైద్య పరీక్షలు అనంతరం శుక్లాల ఆపరేషన్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

పెదకాకాని: యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పెదకాకాని మండలంలోని తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన చందు అక్షయ గౌతమి ఫిబ్రవరి 26న ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. బంధువుల ఇంటి వద్ద విచారించినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. అక్షయ గౌతమి తాతయ్య చెరుకూరి వెంకట ప్రసాదరావు మనుమరాలు అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు గురువారం సీఐ కొమ్మనబోయిన వీరాస్వామి తెలిపారు.

‘సిద్ధం’ సభను జయప్రదం చేద్దాం

- సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ పిలుపు
- నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో పోస్టర్ల ఆవిష్కరణ



నాయకులతో కలిసి పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్

ప్రత్తిపాడు: సిద్ధం సభను జయప్రదం చేయాలని ప్రత్తిపాడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఏటుకూరులోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం ‘సిద్ధం’ వాల్ పోస్టర్లను స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్చి 10న బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గం మేదరమెట్లలో సిద్ధం సభ జరగనుందని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, గుంటూరు రూరల్, వట్టిచెరుకూరు మండలాల నుంచి ప్రత్యేకంగా 400 బస్సులు ఏర్పాటు చేస్తున్నామని, వేల మంది స్వచ్ఛందగా తరలిరానున్నారని బలసాని పేర్కొన్నారు. సిద్ధం సభను జయప్రదం చేయాల్సిన బాధ్యత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులపైన ఉందని చెప్పారు. ఇప్పటికే సభలకు వస్తున్న జన స్పందన అద్వితీయంగా ఉందని, తమది ప్రజా ప్రభుత్వమనేందుకు ఇది నిదర్శనమని కిరణ్‌కుమార్ చెప్పారు. లక్షలాది మంది మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే ఉండాలని కోరుకుంటున్నారని, ప్రజా ఆకాంక్షలకు ప్రతిరూపమే సిద్ధం సభలని బలసాని వివరించారు.

ఇంటింటికీ సంక్షేమం

ప్రభుత్వాన్ని, సంక్షేమాన్ని పేదల గడప వద్దకే చేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి అని నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని అన్నారు. నియోజకవర్గంలో అమ్మఒడి, వైఎస్సార్ రైతు భరోసా, విద్యా దీవెన, జగనన్న చేయూత.. ఇలా దాదాపుగా ముప్పైకు పైగా ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఇప్పటివరకు రూ.1200 కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాకు చేర్చిన దమ్మున్న నాయకుడు జగన్ అని స్పష్టం చేశారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి పేదవారికి కూడా కార్పొరేట్ స్థాయిలో విద్య, వైద్యం అందిస్తున్నారని చెప్పారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, సర్పంచులు, కార్పొరేషన్ డైరెక్టర్లు, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

పేదలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

పేదలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం నిలుస్తుందని ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ అన్నారు. గుంటూరు రూరల్ మండలం చల్లావారిపాలెం గ్రామానికి చెందిన చిన్నిరెడ్డి పెంచలరెడ్డికి సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ. 40 వేల చెక్కును గురువారం ఏటుకూరులోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో బలసాని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఎప్పుడూ ముందంజలో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇంటూరి పద్మావతి, అంజిరెడ్డి, గ్రామ సర్పంచ్ ఆరుదల సాంబశివరావు, రాష్ట్ర సేవాదళ్ నాయకుడు వెంకటప్పారెడ్డి, ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ యార్డు డైరెక్టర్ దుగ్గెంపూడి కిశోర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ తాటిపర్తి పాపిరెడ్డి పాల్గొన్నారు.

119 మంది విద్యార్థులకు టీసీఎస్‌లో ఉద్యోగాలు

గుంటూరు రూరల్: టీసీఎస్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో తమ కళాశాలకు చెందిన 119 మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభించడం హర్షనీయమని ఆర్‌వీఆర్‌జేసీ కళాశాల అధ్యక్షుడు రాయపాటి శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం వారితో పాటు ఎంసీఏ విద్యార్థులకు గురువారం కంపెనీ ఇంటర్వ్యూలు నిర్వహించింది. తొలి దశలో అత్యధిక ప్యాకేజీతో 119 మంది ఎంపికయ్యారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థుల్ని గురువారం కళాశాలలో సెక్రటరీ, కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ 2023 - 24 విద్యా సంవత్సంలో అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ కంపెనీలు తమ క్యాంపస్‌లో నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 401 మందికి ఉద్యోగాలు లభించాయని తెలిపారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ కె. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచంలోని అగ్ర దేశాల్లో ఆర్థిక మాంద్యం నెలకొనడంతో ఉద్యోగ అవకాశాలు తక్కువగా ఉన్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనూ తమ కళాశాల విద్యార్థులకు అవకాశాలు రావడం వారి ప్రతిభకు నిదర్శనమని తెలిపారు. వివిధ బ్రాంచిల్లోని ఏడుగురు విద్యార్థులకు ప్రైమ్ రోల్‌లో రూ. 9 లక్షలు, డిజిటల్ రోల్‌లో రూ. 7లక్షల ప్యాకేజీతో 57 మంది విద్యార్థులు, నిన్జా రోల్‌లో రూ. 3.5లక్షల ప్యాకేజీతో 55 మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందారని కళాశాల ప్రిన్సిపాల్ కొల్లా శ్రీనివాస్ వివరించారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ అండ్ ఆర్‌డీ డైరెక్టర్ కె.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ ఎస్.వి. శ్రీనివాసరావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్స్ సీహెచ్. శ్రీనివాసరావు, వి.జగదీశ్ కుమార్, వివిధ శాఖల విభాగాధిపతులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో ఆరోగ్యం పదిలం

డాక్టర్ ఖాదర్‌వలి



రాగిజావ, కొర్ర అంబలి స్టాల్ ప్రారంభిస్తున్న డాక్టర్ ఖాదర్‌వలి

ప్రత్తిపాడు: చిరుధాన్యాలతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు. గుంటూరులోని రైతు నేస్తం నాచురల్ ప్రొడక్ట్స్ స్టోర్ వద్ద గురువారం చిరుధాన్యాల వంటకాల స్టాల్‌ను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ మనం తీసుకునే ఆహారంలో చిరుధాన్యాల్ని చేర్చుకోవాలని సూచించారు. ఈ పద్ధతిని కొంద మంది అవలంబిస్తున్నప్పటికీ, మరి కొందరు జీవనశైలిలో చోటుచేసుకున్న మార్పుల వల్ల చిరుధాన్యాలతో వంటకాలు చేసుకోలేకపోతున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరూ చిరుధాన్యాల్ని ఆహారంలో చేర్చుకోవాలని ఆయన సూచించారు. రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి బుధవారం, శనివారం అవసరమైన వారికి చిరుధాన్యాల ఆహారాన్ని అందించడంతో పాటు రాగిజావ, కొర్ర అంబలిని ప్రతి రోజూ ఉదయం ఆరున్నర గంటల నుంచి అందుబాటులో ఉంచుతామని చెప్పారు. కార్యక్రమంలో రైతులు, స్థానికులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో నూతనోత్సాహం

- సమన్వయకర్తగా అంబటి మురళీకృష్ణ నియామకంపై హర్షం
- అంబరాన్నంటిన సంబరాలు
- నియోజకవర్గంలో కార్యకర్తల సందడి



అంబటి మురళీకృష్ణకు శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీటీసీ సభ్యుడు రమేష్, నాజర్ తదితరులు



మామిళ్లపల్లిలో మురళీకృష్ణను అభినందిస్తున్న చేబ్రోలు వైఎస్సార్ సీపీ నాయకులు



అభినందిస్తున్న పొన్నూరు నేతలు

పొన్నూరు: ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి విధేయుడు, సేవాతత్పరుడు, బజరంగ్ ఫౌండేషన్ సీఈవో అంబటి మురళీకృష్ణను నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్తగా పార్టీ అధిష్టానం నియమించడంతో పొన్నూరు వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో పార్టీ ముస్లిం నాయకులు షేక్ నాజర్ ఆధ్వర్యంలో బాణసంచా వెలుగులతో సంబరాలు ఘనంగా నిర్వహించారు. మిఠాయిలు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మురళీకృష్ణకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.

పార్టీ నేతల్లో ఐక్యత

2019 ఎన్నికల తర్వాత చిన్న చిన్న విభేదాల కారణంగా నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు కొందరు పార్టీకి దూరంగా ఉంటున్నారు. కానీ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. తమ మధ్య వ్యక్తిగతంగా ఎన్ని విభేదాలు ఉన్నప్పటికీ పొన్నూరులో ప్రతిపక్ష టీడీపీకి తావివ్వకుండా ముందుకు సాగుతున్నారు. వైఎస్సార్‌సీపీ అధిష్టానం అంబటిని ప్రకటించడంతో ఇన్నాళ్లు స్తబ్దతగా ఉన్న పార్టీ శ్రేణుల్లో ఐక్యత కనిపించింది. రానున్న ఎన్నికల్లో అంబటి మురళీకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు పార్టీ నాయకులు సన్నద్ధమయ్యారు.

మామిళ్లపల్లిలో కోలాహలం

గురువారం నియోజకవర్గ పార్టీ శ్రేణులందరూ ఏకమై ఐకమత్యంగా అంబటి మురళీకృష్ణని కలిసేందుకు రావడంతో మామిళ్లపల్లి కోలాహలంగా మారింది. పొన్నూరు నుంచి గ్రామం వరకు నేతలు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు రమేష్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి మురళీకృష్ణకు శుభాకాంక్షలు తెలియజేశారు. పూల కిరీట ధారణ చేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

పెదకాకానిలో..

పొన్నూరు నియోజకవర్గానికి నూతన ఇన్‌చార్జిగా బజరంగ్ పౌండేషన్ చైర్మన్ అంబటి మురళిబుకృష్ణ పేరును పార్టీ అధిష్టానం ప్రకటించడంతో పెదకాకాని, నంబూరు గ్రామాల్లో సంబరాలు అంబరాన్ని అంటాయి. కొంతకాలంగా నియోజకవర్గం ఇన్‌చార్జి పేరు ప్రకటించడంపై ఉత్కంఠ నెలకొని ఉంది. అంబటి మురళీకృష్ణ పేరును ఖరారు చేయడంతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం ఉప్పొంగిపోయింది. గురువారం ఉదయం మామిళ్లపల్లిలోని అంబటి నివాసానికి నాయకులు చేరుకుని అభినందనలు తెలియజేశారు. బొకేలు, పూలమాలలు, స్వీట్లు పంపిణీ చేశారు. బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. మామిళ్లపల్లిలో అంబటి మురళీకృష్ణను కలసిన వారిలో జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, పెదకాకాని సర్పంచి గోళ్ల స్వరూపరాణి, ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు గుజ్జుల సుమతి, ఎంపీటీసీ సభ్యులు షేక్ గుల్జార్, షేక్ షహనాజ్, మాతంగి నిర్మల, బంగారు మరియమ్మ, నంబూరు ఎంపీటీసీ సభ్యులు షేక్ అబ్దుల్ లతీఫ్, వల్లభాపురపు విజయ్‌కుమార్, దాసరి నాగేశ్వరరావు, పార్టీ నాయకులు వుయ్యూరు సతీష్‌రెడ్డి, మందాళ శివారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు చాగంటి మురళీమోహన్‌రెడ్డి, గ్రామ కన్వీనర్ భీమవరపు కృష్ణారెడ్డి, కరణం శంకరావు, పెరుమాళ్ల అనిల్, ఆలపాటి రాఘవ, సుంకర కృష్ణారెడ్డి, బండెల ఉదయ్‌శంకర్, షేక్ మీరు ఉన్నారు.

నియోజకవర్గంలో జోష్

చేబ్రోలు: పొన్నూరు సమన్వయకర్తగా అంబటి మురళీకృష్ణను ప్రకటించటంపై గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. పొన్నూరు మండలం మామిళ్లపల్లి గ్రామానికి చెందిన అంబటి మురళీకృష్ణ ఇప్పటికే పొన్నూరు నియోజకవర్గ వ్యాప్తంగా బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందారు. సమన్వయకర్తగా అంబటి మురళీకృష్ణ ప్రకటించటంతో పొన్నూరు పట్టణం, రూరల్, పెదకాకాని, చేబ్రోలు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు మామిళ్లపల్లిలోని అంబటి మురళీకృష్ణను కలిసి అభినందనలు తెలిపారు. చేబ్రోలు, కొత్తరెడ్డిపాలెం, మంచాల, వేజండ్ల, వడ్లమూడి, శలపాడు తదితర గ్రామాల్లో పార్టీ శ్రేణులు టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు.

ఎమ్మెల్యే కిలారికి అభినందనలు

గుంటూరు వైఎస్సార్ సీపీ పార్లమెంటు సమన్వయకర్తగా పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యను పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. ఈ నేపథ్యంలో వివిధ నియోజకవర్గాలకు చెందిన పార్టీ నాయకులు, అభిమానులు, పార్టీ శ్రేణులు రోశయ్యకు అభినందనలు తెలిపారు.



పొన్నూరులో వైఎస్సార్ సీపీ జెండా ఎగరవేస్తున్న ముస్లిం నాయకులు



పొన్నూరు అంబేడ్కర్ సెంటర్‌లో బాణసంచా కాలుస్తున్న పార్టీ శ్రేణులు



పొన్నూరు అంబేడ్కర్ సెంటర్‌లో వైఎస్సార్ సీపీ నేతల సంఘీభావం



మురళీకృష్ణను అభినందిస్తున్న పెదకాకాని మండల పార్టీ నేతలు

సైబర్ సెక్యూరిటీలో ఎథికల్ హ్యాకింగ్ పాత్ర ప్రత్యేకం



పెదకాకాని: సైబర్ సెక్యూరిటీలో ఎథికల్ హ్యాకింగ్ పాత్ర ప్రత్యేకమని సర్టిఫైడ్ ఎథికల్ హ్యాకర్ షేక్ ప్రేమ్ నజీర్ తెలిపారు. వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఐఈఈఈ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఎథికల్ హ్యాకింగ్‌పై రెండు రోజుల పాటు నిర్వహించనున్న వర్క్‌షాప్ గురువారం ప్రారంభమైంది. విద్యార్థులకు వివిధ రకాల హ్యాకింగ్ టూల్స్‌పై షేక్ ప్రేమ్ నజీర్ అవగాహన కలిగించారు. హానికరం కాకుండా భద్రతను పరిరక్షించడానికి ఎథికల్ హ్యాకింగ్ విధానాన్ని అవలంబిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై. మల్లికార్జునరావు, డీన్ ఆఫ్ అకడమిక్ కె. గిరిబాబు, సీఎస్‌ఈ విభాగాధిపతి ఎం.ఆర్. ఠాగూర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లాటరీ పేరుతో మోసం చేస్తున్న నలుగురిపై కేసు నమోదు

గుంటూరు రూరల్: లాటరీ పేరుతో ప్రజల్ని మోసం చేస్తున్న నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. గుంటూరు రూరల్ మండలం రెడ్డిపాలేనికి చెందిన కుంటిగొర్ల దిబ్బరాజు, కుంటిగొర్ల అంజి, క్రోసూరు నరసింహారావు, బిట్రా సాంబశివరావు తక్కువ రేటుకు సామాన్లు కొనుగోలు చేసి, మిర్చి యార్డు సమీపంలో వాటిని లాటరీలు తీస్తున్నారు. యాభై రూపాయలకు టికెట్‌ను ప్రజలకు విక్రయిస్తున్నారు. వాటిలో సున్నా నంబరు కార్డులు ఎక్కువగా ఉంచి, టికెట్లు కొనుగోలు చేసిన వారికి సామానులు రాకుండా మభ్య పెట్టి మోసం చేస్తూ, అక్రమంగా డబ్బు సంపాదిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వారిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.3వేలతో పాటు స్టీలు సామానులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నల్లపాడు సీఐ రాంబాబు తెలిపారు.

విద్యార్థులు భావి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



విద్యార్థినులకు సర్టిఫికెట్లు, ట్రోఫీ అందజేస్తున్న లలిత ప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు భావి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జిల్లా ఉమ్మడి పరీక్ష మండలి (డీసీఈబీ) కార్యదర్శి జి. లలితప్రసాద్ సూచించారు. నగరంపాలెంలోని స్టాల్ బాలికోన్నత పాఠశాలలో గురువారం ఎంటర్‌ప్రెన్యూరియల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం పేరుతో జిల్లాస్థాయి ఎక్స్‌పో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లలిత ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఉపాధి కల్పన అవకాశాలు, పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు 21వ శతాబ్దపు నైపుణ్యాల్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఎస్సీఈఆర్టీ, సమగ్రశిక్షతో పాటు ఉద్యమ్, రీడ్ బెనిఫిట్, అఫ్లోటన్ స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ఎక్స్‌పోలో విద్యార్థులు ఆవిష్కరణలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జిల్లా తొలి రెండు స్థానాల్లో ఎంపికైన మంగళగిరిలోని సీకే గరల్స్ హైస్కూల్, పెనుమాకలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. అనంతరం విజేతలకు సర్టిఫికెట్లు, ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో ఈఎండీపీ ప్రోగ్రాం మేనేజర్ సతీష్, సమన్వయకర్త డాక్టర్ పి. పద్మావతి, జిల్లా సైన్సు అధికారి రవికుమార్, జిల్లా సైన్సు సమన్వయకర్త గౌసుల్‌మీరా, ప్రోగ్రాం జోనల్ మేనేజర్ బ్రహ్మం, జిల్లా మేనేజర్ ఆరాధ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్టేడియం అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి

నగర కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: బీఆర్ స్టేడియంలో అభివృద్ధి పనుల్ని వేగంగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి శాప్, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో నిర్దేశిత యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. ఆమె గురువారం స్టేడియంలో జరుగుతున్న పనుల్ని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త నూరి ఫాతిమా, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మార్చి 15 నాటికి గ్రౌండ్ పనులు, 25 నాటికి గ్యాలరీ పనులు పూర్తి చేయాలని చెప్పారు. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో వాకర్స్ వస్తుంటారని, తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

పర్యటనలో శాప్ ఈఈ సిద్దయ్య, జీఎంసీ ఈఈ కోటేశ్వరరావు, డీఎస్డీఓ వెంకటేశ్వరరావు, డీఈఈ శ్రీధర్, ఏఈ సునీల్ కుమార్, రాంబాబు, స్థానిక కార్పొరేటర్ మీరావలి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

డీఎంహెచ్ఓ ఏఓగా లక్ష్మీకుమారి



గుంటూరు మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం పరిపాలనా అధికారిగా మేడూరి వెంకటలక్ష్మీ కుమారి గురువారం విధుల్లో చేరారు. డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మిని కలిసి జాయినింగ్ రిపోర్టు అందజేశారు. ఏపీపీఎస్సీ ద్వారా 1987లో టైపిస్టుగా ప్రకాశం జిల్లా కంబంలో ప్రభుత్వ సర్వీసులోకి ప్రవేశించి, 1995లో సీనియర్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ పొందారు. ఆఫీస్ సూపరింటెండెంట్‌గా 2017లో ప్రమోషన్ పొంది నల్లపాడు రీజనల్ ట్రైనింగ్ సెంటర్ (మేల్)కు బదిలీ అయ్యారు. నూతన జిల్లాల ఏర్పాటులో భాగంగా నరసరావుపేట డీఎంహెచ్ఓ కార్యాలయం సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. మూడు రోజుల కిందట ఏఓగా ప్రమోషన్ పొంది గురువారం విధుల్లో చేరారు. నూతనంగా విధుల్లో చేరిన ఏఓ లక్ష్మీకుమారికి పలువురు కార్యాలయ ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

వైభవంగా శ్రీ శారదా పరమేశ్వరి రథోత్సవం

పాత గుంటూరు: సంపత్‌నగర్‌లోని శ్రీ శారదా పరమేశ్వరి దేవస్థానం 58వ వార్షికోత్సవాన్ని ఆలయ గౌరవ ప్రతినిధి పోలిశెట్టి శ్రీహరి ప్రసాదరావు ఆధ్వర్యంలో గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి విశేష పూజలు, సాయంత్రం రథోత్సవం అంగరంగ వైభవంగా జరిపారు. కార్యక్రమంలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆర్డీ ఆఫీస్ సూపరింటెండెంట్‌గా నాగూర్ షరీఫ్

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయం సూపరింటెండెంట్‌గా షేక్ నాగూర్ షరీఫ్ నియమితులయ్యారు. ఆర్డీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆయనకు గురువారం ప్రమోషన్ కౌన్సెలింగ్ నిర్వహించి ఉత్తర్వులు అందజేశారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న కె.సుధీర్ గురువారం పదవీ విరమణ చేశారు. నూతనంగా విధుల్లో చేరిన నాగూర్ షరీఫ్‌ను ఆర్డీ డాక్టర్ శోభారాణి, పలువురు కార్యాలయ ఉద్యోగులు అభినందించారు. ఏపీ ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్న నాగూర్ షరీఫ్ సూపరింటెండెంట్‌గా ప్రమోషన్ పొందడంతో సంఘ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాస్, సెక్రటరీ శెట్టిపల్లి సతీష్‌కుమార్, నగర అధ్యక్షుడు మూర్తి, సెక్రటరీ చింతల కళ్యాణ్, పలువురు యూనియన్ నేతలు అభినందనలు తెలిపారు.